# అంకితం

ఆమె ఆకాశం నుంచి రాలిన సుధా బిందువు.

విశ్వకర్మచే మలచబడ్డ సౌందర్య శిల్పం.

ఆమె లావణ్యం, మేఘాల మధ్య మెరుపు.

ఆమె పలుకులు తియ్యని తేనెల వాకలు. ఆమె నడక హంసగమనం.

వేయేల, ఆమె కావ్యనాయిక.

ఇలా కాలేజీలో ప్రతీ ఒక్కరూ ఆమెను రకరకాలుగా వర్ణిస్తూ ఆరాధిస్తున్నారు. ఆమె మీద ప్రేమాతిశయం పట్టలేని కొందరు వాహనాల నెంబరు ప్లేట్ల మీద ఆమె పేరు ముచ్చటగా పెయింటు చేయించుకొన్నారు. అవి లేనివాళ్ళు చొక్కా జేబులు మీద ఆ మూడక్షరాలు ముద్రించుకొన్నారు. వేసవి కాలంలో విజయవాడలో ఉష్ణోగ్రత పెరిగినట్లుగా వారి ప్రయత్నాలు కూడా దిన దినాభివృద్ధి చెందుతున్నాయి.

అలా కాలేజీలోని మగ పురుషులంతా తన పేరును కొంగల్లా జపిస్తూండేసరికి వసంత టెక్కు ఇంకా ఎక్కువయింది. స్టయిల్ అనూహ్యంగా పెరిగిపోయింది. గర్వం ఆంజనేయుడి తోకలా విజృంభించింది.

ఇనిస్టిట్యూట్‌లోని అందరి మతులు పోగొడుతూ ఆ రోజు టైప్ నేర్చుకోవడానికి చేరింది వసంత. ప్రిన్సిపాల్‌తో సహా ఆ అవర్‌లో వుండే విద్యార్థులంతా ఆమె అందానికి జోహార్లర్పించారు. గారంగా, తియ్యగా, ముద్దుగా మాట్లాడుతూ ప్రిన్సిపాల్ చేత చెప్పించుకుని లెటర్స్‌చేయడం మొదలు పెట్టింది.

ఆమె అటు బయటకు అడుగుపెట్టిన మరుక్షణమే లోపలికి దూరాడు సెకండ్ బి.ఎ. చదువుతున్న సుబ్బారావు.

ప్రిన్సిపాల్ రూమ్ గుమ్మంలో నిలబడి రెండు చేతులెత్తి "నమస్కారం సార్" అన్నాడు అతి వినయంగా.

ప్రస్తుత విద్యార్థుల కేర్‌లెస్‌నెస్‌కు విసుగుచెంది వున్న ప్రిన్సిపాల్ ఎడారిలో కనిపించిన ఒయాసిస్‌లా సుబ్బారావు వినయానికి ముగ్ధుడై "రా బాబూ కూర్చో" అన్నాడు.

"ఏం కావాలి నాయనా" అన్నారు అద్దాలు సవరించుకొని.

"నేను మీ ఇనిస్టిట్యూట్‌లో చేరుతాను సార్"

"అవశ్యం చేరునాయనా! మా ఇన్‌స్టిట్యూట్‌లో చేరడం నీ విజయానికి సింబల్" సొంతడబ్బా కొట్టుకోవడం మొదలు పెట్టాడు.

"సార్" అన్నాడు తలపట్టుకొని సుబ్బారావు.

"ఏం బాధగా ఉందా" జాలిగా అడిగాడు ప్రిన్సిపాల్.

"కాక, నాబాధల్లో నేనుంటే"

"పోనీలే బాబూ. మాట్లాడను. నీకు సాయంత్రం ఫైవ్ టు సిక్స్ ఇస్తున్నాను. ఫీజు పాతికరూపాయిలివ్వు".

"సార్ పాతిక కాదు. యాభై రూపాయిలిస్తాను. నాకు దీనికి ముందు అవరు కావాలి"

"అయామ్ సారీ. ఆ అవరు ఖాళీ దొరకదు."

"ఇంతకూ నేనొచ్చింది ఆ అవరులో చేరడానికే గదా సార్" బ్రతిమాల్తూ అన్నాడు సుబ్బారావు.

"నో నో ! వీలుకాదు బాబూ" ఖచ్చితంగా అన్నాడు.

అయినా సుబ్బారావు నిరాశపడలేదు. కాళ్లావేళ్లాపడి ఓ నూటపదహార్లు సమర్పించి సంపాదించుకొన్నాడు చివరికి.

వసంత టైప్ ఇనిస్టిట్యూట్‌లో చేరిందని మరునాడు దాదాపు పాతిక మంది యువకులు వచ్చారు. ఆమె అవర్‌లోనే గాక ఆమె వెనుక అవర్‌లో కూడా ఖాళీలేదని తెలిసి హుతాశులయిపోయారు. సుబ్బారావు అదే అవర్‌లో సీటు సంపాదించాడని తెలిసి తెగోీక్కుచచ్చారు. వచ్చాం కదా వెనక్కిపోవడం దేనికి? వసంత అవర్లో ఎవరో ఒకరు సెలవు పెట్టకపోతారా అనే ఆశతో తాత్కాలికంగా ఏదో ఒక అవర్లో చేరిపోయారు.

ఇనిస్టిట్యూట్ కిటకిటలాడే బస్సులా వుండేసరికి ప్రిన్సిపాల్ ఆనందపడిపోయి దీనికంతటికి పరోక్షంగా కారణమయిన వసంతకు ఫీజు కన్సెషన్ ఇవ్వాలని నిర్ణయించు కున్నాడు.

సుబ్బారావు కొంత ప్రొగ్రెస్ సాధించి ఎక్కడో ఒక మూలనున్న తన సీటును వసంత పక్కనే వేయించుకున్నాడు. సుబ్బారావు ప్రోగ్రెస్ సాధించి టైప్‌లో కాదు, ప్రిన్సిపాల్‌ని కాకాపట్టడంలో. వసంత ప్రక్కనే కూర్చొని ఆమె నవ్వినపుడు కోతిలా కిచకిచలాడుతూ, ఆమె టైప్ చేస్తుంటే తన మిషన్ మీద చేతులుపెట్టి చూస్తూ ఆమె చేతిలోని కాగితాలు కిందపడితే తీసి అందిస్తూ కాలం గడుపుతున్నాడు. అంతేగాని ధైర్యంగా తన ప్రేమ వెల్లడిచేయలేకున్నాడు.

ఇకపోతే బిఎస్సీ ఫస్టియిర్ చదువుతున్న సారంగపాణి వాళ్ళున్న ఇంటికి నాలుగిళ్ళు అవతలున్నాడు. ఆమె నిత్యం సాయంత్రం పూట గాంధీ పార్క్‌కి వెళ్ళేది. చాలాకాలం నుంచి అతనికి తెలుసు. పురివిప్పిన నెమలిలా ఇటీవల కాలంలో ఎన్నో అందచందాలను సంతరించుకొన్న వసంతను ఎలాగైనా తనదానిని చేసుకోవాలనుకొన్నాడు.

ఆ సాయంత్రం ఆమె వెనుకనే తన ప్రెట్టీడాగ్ గొలుసు పట్టుకొని పార్క్‌కి వెళ్ళాడు. ఆమె మెత్తని పచ్చికలో కూర్చుని అటూ ఇటూ చూసింది. ఎదురుగా చిరునవ్వు నవ్వుతూ నిలబడి వున్నాడు సారంగపాణి.

"అరె ఈ డాగ్ చాల బాగుందే. ఎక్కడ నుండి తెప్పించారు" అంది కలుపుగోలుగా.

"బెంగుళూరు నుంచండీ" ఆనందంతో ఉబ్బిపోతూ తనూ ఆమె కెదురుగా కూర్చున్నాడు.

"దాని జాతేమిటి?" అనడిగింది.

చెప్పాడు. ఇంకా దాని అలవాట్లు గురించి విశ్వాసం గురించి ఏవేవో చెప్పాడు.

"ఇవి చాలా రేర్ ప్రిసీస్ అండీ! మీకు ఒకటి ప్రెజెంట్ చేస్తాలెండి"

"థాంక్యూ" అంది వసంత.

అలా వాళ్ళ పరిచయం పెరిగిపోయింది. రోజూ కుక్కతో సారంగపాణి పార్కుకి రావడం, వసంత అతని కుక్కపిల్లను దగ్గరకు తీసుకుని సారంగపాణితో కబుర్లు చెప్పడం జరుగుతోంది. వసంతకు కుక్క పిల్లను ప్రెజెంట్ చేస్తే తన ముఖం చూడదనుకొన్న సారంగపాణి ఏరోజు కారోజు వాయిదా వేస్తూనే ఆమె మీద ప్రేమ వలలు విసురుతున్నాడు.

ఇకపోతే మూడవవాడు నారాయణ స్వామి. వసంతకు దగ్గరి బంధువు. ప్రతి ఆదివారం వసంత తప్పనిసరిగా నారాయణ స్వామి ఇంటికి వెళ్తుంది. ఇద్దరూ కలిసి టి.వి.చూస్తుంటారు. సాహితీ చర్చలు చేస్తుంటారు. సాయంత్రం పూట ఇంటి వెనుక గ్రౌండ్‌లో టెన్నీస్ ఆడుతుంటారు. వసంత తన బంధువుల అమ్మాయి కావడం నారాయణ స్వామికున్న అతి గొప్పహోల్డు. తనదీ కాకుండా ఎక్కడికి పోతుంది అనేది అతని ధైర్యం. దానికి తగట్టు వసంత అతనితో అతి చనువుగా వుంటుంది.

ముఖ్యమైన ప్రేమికుల్లో నాలుగవవాడు శ్యామ్ సుందర్. ప్రేమించే హృదయం తప్ప ఇతనికే అర్హతలూ లేవు. ఇది కాలేజీలో వసంతను అభిమానించే ఎన్నో వందల మందికుంది. ఐతే ఇతనికి పై ముగ్గురిలా వసంతతో రోజూ కొన్ని గంటలు గడిపే అవకాశముంది. కారణం అతను వసంత ఇంటి మేడమీద గది అద్దెకు సంపాదించడమే. ఆ రూము సంపాదించడానికి అతనికి ప్రాణవాయువు లేకుండా ఎవరెస్టు శిఖరం ఎక్కినంత పనయింది.

శ్యామ్ సుందర్ వాళ్ళ గ్రామ సర్పంచ్ ద్వారా సమితి ప్రెసిడెంట్‌కి చెప్పించి, సమితి ప్రెసిడెంట్ ద్వారా ఎమ్మెల్యేను పట్టి, ఎమ్మెల్యే చేత కాంట్రాక్టరయిన వసంత తండ్రికి అతి కీలకమైన కాంట్రాక్టు క్షణాల్లో ఇప్పించాడు. వసంత ఇంట్లో మేడమీద గది శ్యామ్ సుందర్‌కి రెకమెండ్ చేయబడింది అలా.

పర్యవసానంగా శ్యామ్ సుందర్‌కి వసంత ఇంటి మేడమీద గది అద్దెకు దొరికింది. అప్పట్నుంచి వసంతతో తీరిక దొరికినప్పుడల్లా హస్కు కొడుతూ తన ప్రేమను బలీయం చేసుకోవడానికి తల క్రిందులుగా తపస్సు చేయసాగాడు.

మొత్తం కాలేజీలో పై నలుగురి ప్రేమికులకు మాత్రమే పరిస్థితులు కలిసొచ్చాయి. గనుక తమ ప్రేమ బీటుల వారకుండా నానా తంటాలు పడుతున్నారు.

ఎవరికివారే వసంత హృదయం తమకు అంకితమని మురిసిపోసాగారు.

• • •　　　• • •　　　• • •

రోజులు గడిచిపోతున్నాయి.

ఒకరోజు టైప్ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ వసంతను లోపలికి పిలిచాడు.

"అమ్మా వసంతా! ఇక ఈ ఇనిస్టిట్యూట్ నడపలేనమ్మా!" అన్నాడు తల పట్టుకుని.

"ఏమయింది సార్?" అంది ఆందోళనగా, అతనికెదురుగా వున్న కుర్చీలో కూర్చుంటూ.

"అయ్యేదేమిటమ్మా! కొంప మునిగింది."

"విషయం చెప్పండి సార్!" అంది విసుగ్గా.

"ఏమని చెప్పేది తల్లీ! ఇప్పటి వరకూ నా ఇనిస్టిట్యూట్‌కి టౌన్లో ఎంతో పేరుంది."

"ఆ పేరుండబట్టే కదా సార్! నేను చేరింది"

'చెప్పేదేదో ముందు చెప్పి ఏడువు. సోది తరువాత' గొణుక్కుంది.

"ఎప్పుడూలేంది నీ ప్రభావం వల్ల మా ఇనిస్టిట్యూట్‌లో ప్రేమబీజాలు రాలి స్టూడెంట్లు ఒకరికొకరు పది ప్రేమ వివాహాలు చేసుకుని సంచలనం రేపారు. అంతేగాక, ఉన్న వాళ్లు నీపేరే జపిస్తూ నీ కోసమే ఇనిస్టిట్యూట్‌కి వస్తున్నారు. కానీ, వాళ్ళెవరికీ టైపు రాదు. మొన్నటి వరకూ సెంట్ పర్సెంట్ రిజల్ట్సు వచ్చిన మా ఇనిస్టిట్యూట్‌కి ఈసారి టెన్ పర్సెంట్ వస్తుందని కూడా నమ్మకం లేదు తల్లీ!"

"అయితే, దీనికంతటికి నేనే కారణమంటారా?"

"అవును తల్లీ! దీనికంతటికి నీ అందమే కారణం. నిన్నటికి నిన్న స్పీడ్ టెస్ట్ పెడితే నీ పక్క సీటు సుబ్బారావు పేపరంతా వసంతా అంటూ టైపు చేశాడు. ఇదేమిటయ్యా అని అడిగితే ఈమె నాకు కాబోయే పెళ్ళాం, చేస్తే తప్పా? అన్నాడు. అమ్మా మీరు కాబోయే మొగుడూ పెళ్ళాలో, అయిపోయిన మొగుడూ పెళ్ళాలో నాకు తెలియదు. కానీ నీవల్ల ఎంత మంది పిచ్చి వాళ్ళయిపోతున్నారో నాకు తెలుసు."

"అవును వసంతా! ఎప్పటికైనా మనం కాబోయే భార్యాభర్తలం గదా?" ధైర్యంగా అన్నాడు అప్పుడే లోపలి కొస్తున్న సుబ్బారావు.

అంతే. సుబ్బారావు చెంప చెళ్లుమనిపించింది వసంత.

"మూర్ఖుడా! ఒక ఆడపిల్ల తోటిమగ వాడితో స్నేహం చేసినంత మాత్రాన పెళ్ళామయిపోతుందా? ఇంక నుంచి ప్రచారాలు కట్టిబెట్టి బుద్ధిగా బ్రతుకు. అయ్యా, ప్రిన్సిపాల్ గారూ! విద్యార్థుల్ని క్రమశిక్షణలో పెట్టలేక నాకు చెప్పుకుని ఏడ్చే మీ అసమర్థతకు హేట్సాఫ్! ఇక నుంచి నేను ఆ వైపు ఇనిస్టిట్యూట్‌కి రాను." అంటూ ఫోటో నెగిటివ్‌లా వున్న ప్రిన్సిపాల్ ముఖం మీద కాగితాలు విసిరికొట్టి చకచకా బయటికి నడిచింది.

మరుసటి రోజు తన ఇనిస్టిట్యూట్‌లో ఉన్న వంద మందిలో డెబ్భై అయిదుమంది గుడ్‌బై కొడతారని అతనికి తెలియదు పాపం.

సుబ్బారావు ప్రిన్సిపాల్ గది దాటకముందే వసంత అతనిచెంప పగలగొట్టిందన్న వార్త స్పెషల్ బులిటెన్‌లా కాలేజీ అంతా తెలిసిపోయింది. ఈ విషయం తెలిసిన మిగతా ముగ్గురూ ఆనందంతో డిస్కో డాన్స్ చేశారు. శ్యామ్‌సుందర్ దేవుడికి కొబ్బరికాయ కొట్టి గదిలో టేబుల్ మీదున్న మూడు దిష్టి బొమ్మల్లో ఒక దిష్టి బొమ్మ తల పగులగొట్టి వికటాట్టహాసం చేశాడు.

సరిగ్గా ఇది జరిగిన నెల రోజులకు పార్కులో ఒక చల్లని సాయంత్రం వసంత కిలకిలా నవ్వుతూ కుక్క పిల్లను ఒళ్లోకి తీసుకుని దాని బొచ్చు నిమురుతున్న వేళ సారంగపాణికి రోజులు మూడి తన విషయం అటో ఇటో తేల్చుకోవాలనుకున్నాడు.

"వసంతా! నేనంటే నీ అభిప్రాయమేమిటి?"

"నా అభిప్రాయమేమిటంటే, మీరు కుక్కపిల్లని ఇస్తానని ఇవ్వలేదు గనక మీరు అబద్ధాలు చెబుతారని."

"అదికాదు వసంతా!నేను కుక్క పిల్లను తప్పక తెచ్చిస్తానుగాని నా మీద నీకున్న వ్యక్తిగత అభిప్రాయం చెప్పు."

"మీరు చాలా మంచివారు."

"అంతకంటే మరేమీ లేదా."

"ఇంకేముందండీ."

"ప్రేమ."

"ప్రేమా ? నేను సమస్త జీవరాశిని ప్రేమిస్తానండి!"

"ఆ ప్రేమ కాదు వసంతా! నా మీద నీకున్న ప్రేమ. నీ కోసం పరితపిస్తున్న ఈ దేవదాసుని, ఈ మజ్నూని, దారి తెలియక అల్లాడుతున్న ఈ బాటసారిని కనికరించి కరుణించు" అంటూ మోకాళ్ళ మీద కూర్చొని ఆమె చేతిని తన చేతుల్లోకి తీసుకుని నిమరసాగాడు.

చప్పున చేయి లాక్కొని వళ్ళోని కుక్క పిల్లని విసిరిగొట్టింది. అది కుయ్యో కుయ్యోమని ఏడుస్తూ సారంగపాణి పాదాల దగ్గరికి పోయింది.

"మిస్టర్ సారంగపాణీ! నీ కుక్క పిల్లను అభిమానించినంత మాత్రాన నిన్ను ప్రేమిస్తున్నాననుకున్నావా? నిజమైన స్నేహితుడవని ఇంత కాలం నమ్మాను. నీది కుక్కబుద్ధని ఇప్పుడే తెలుసుకున్నాను. ఛ... ఛ... కుక్కబుద్ధి కాదు, గాడిద బుద్ధి. వెనుక నిలబడి తన్నే బుద్ధి." ఛడామడా వాయించి వడివడిగా వెళ్ళిపోయింది వసంత.

అప్పటి వరకూ గార్డెన్‌లో అక్కడక్కడా పొదల వెనుక నక్కివున్న వసంత అభిమానులు అతని చుట్టూ చేరి అర్ధచంద్రాకృతిలో నిలబడి ఉన్నారు. సారంగపాణి తలెత్తగానే "కంగ్రాచ్యులేషన్స్!" అంటూ అతన్ని అభినందించి తమ కసితీర్చుకున్నారు.

శ్యామ్‌సుందర్ టేబుల్ మీదున్న రెండవ బొమ్మను ముక్కలు ముక్కలు అయ్యేటట్లు నేలకేసి కొట్టాడు. అయితే ఈసారి అతనికి ఆనందంగా లేదు. పై రెండు సంఘటనలు జరిగాక తన ప్రేమకు కూడా అదే గతి పట్టబోతుందని తీర్మానించుకొన్నాడు. అతని కంటికి వసంత ఝాన్సీరాణీగాను, రుద్రమదేవిగాను కనిపిస్తూ వుంది.

• • •    • • •    • • •

రోజులు గడుస్తున్నాయి. శ్యామ్‌సుందర్ తన మనసులోని మాట బయట పెట్టడానికి భయపడుతున్నాడు. కానీ అది ఎప్పటికైనా తప్పదని అతనికి తెలుసు.

"శ్యామ్‌సుందర్ గారూ! శ్యామ్‌సుందర్‌గారూ!" అరుస్తూ హడావిడిగా మేడమీదకు వచ్చింది ఓ సాయంత్రం వసంత.

ఈజీ చైర్‌లో పడుకొని ఏదో నవల చదువుకొంటున్న శ్యామ్‌సుందర్ "ఎందుకండీ అంత కంగారు? కుర్చీ తెస్తానుండండి కూర్చొందురు?" అంటూ లేచాడు.

శ్యామ్‌సుందర్‌ని ఆపి, తనే లోపలికి వెళ్ళి కుర్చీ తెచ్చుకుంది. తరువాత ఫ్రీగా కూర్చొని గుండెల నిండుగా గాలి పీల్చి ఉఫ్ అని వదిలింది.

ఎప్పుడైనా వసంత శ్యామ్‌సుందర్ గదికొచ్చి కారమ్సు ఆడడం అలవాటు.

"అందుకే మీ మనసేమీ బాగలేనట్లుంది. కారమ్సు ఓ గేము ఆడుదామా?" అన్నాడు.

"నో...నో... ఆ గేము కాదుకాని, శ్యామ్‌సుందర్ గారూ, జీవితమనే ఈ గేము అన్నింటిలోకి అత్యంత కష్టతరమైందండీ. ఛీ.. ఛీ.. ఈ సమాజంలో ఉండేది మనుషులు కాదండి, రాక్షసులు! ఐ హేట్‌ది సొసైటి" గుండెలమీద చేతులుంచుకుని రొప్పుతూ అంది. కోపంతో ఆమె ముఖం ఎర్రగా తయారైంది.

ఏదో జరుగుంటుందని భావించిన శ్యామ్‌సుందర్ ఆమె చెప్పబోయేది వినడానికి సిద్ధపడ్డాడు.

"అసలు ప్రేమంటే ఏమిటి శ్యామసుందర్ గారూ?" అనడిగింది వసంత.

అనుకున్నదే అయినా ఆ సమయం వచ్చేసరికి శ్యామ్‌సుందర్ తడబడ్డాడు. వల్లె వేసిన ప్రేమ పాఠాలు మరిచిపోయాడు,

"ప్రేమంటే ... అదే.... ప్రేమంటే అభిమానం!"

"అంతేనా?" అంది వసంత రెండు చేతులు కట్టుకుని ఎటోచూస్తూ.

మళ్ళీ మళ్ళీ ఇలాంటి అవకాశం దొరకదని భావించిన శ్యామ్‌సుంరద్ "ప్రేమంటే రెండు హృదయాల కలయిక. పరస్పరం మానసికంగా ఒకరికొకరు దగ్గర కావడం, ఊహల్లోను, చేతల్లోనే ఒకటిగా వుండడం, జీవితాంతం ఒకటిగా బ్రతకడం.

ఒకరు లేనప్పుడు మరొకరు పరితపించడం, అలా ఒకరిలో ఒకరు ఐక్యం కావడం. ఇదే ప్రేమంటే" అన్నాడు.

"మరి మీరు మీ నాన్నను, అమ్మను చెల్లెళ్ళను, తమ్ముళ్ళలను ప్రేమిస్తున్నారు కదా, మరి మీ అందరి ఊహలు, ఆలోచనలు ఒకే విధంగా వుంటున్నాయా?" అతని వాక్ప్రవాహానికి అడ్డొస్తూ అడిగింది వసంత.

"అది కాదండి, నేను చెప్పేది ప్రేయసీ ప్రియుల మధ్య ప్రేమండీ!"

"ఎందుకండీ, ఎవర్ని కదలించినా ప్రేయసీ ప్రియుల మధ్య ప్రేమగురించే చెబుతారు! స్నేహితుల మధ్య ఉండేది ప్రేమ కాదా!"

శ్యామ్‌సుందర్ ఏదో చెప్పబోయి నాలుక కొరుక్కుని "అబ్బా!" అన్నాడు.

"సరే పోనివ్వండి, ఈ రోజు జరిగిన ఒక విచిత్రమయిన సంఘటన గురించి చెప్పమంటారా?"

"మీరు చెప్పడమూ, నేను వినకపోవడమా? చెప్పండి" అన్నాడు ఎంతో ఉత్సాహంగా శ్యామ్‌సుందర్.

"నేనే ఈ రోజు మా పెదమామ గారింటికి వెళ్ళానండి! అక్కడ మా మామగారి కొడుకు మన క్లాస్‌మేట్ నారాయణస్వామి లేడూ?"

'ఎందుకు లేడు? దున్నపోతులా ఉన్నాడు. నా ప్రేమబాటకు అడ్డుగోడ నాకున్న ప్రత్యర్థివాడే' మనసులోనే ఏడ్చాడు శ్యామ్‌సుందర్.

"ఈరోజేం జరిగిందో తెల్సా? 'రా వసంతా! నా గదిలోకెళ్దాం కొత్త కాసెట్స్ తెచ్చాను, పాటలు విందాం' అన్నాడు. సరే నని వెళ్ళాను. ఇద్దరం పాటలు వింటున్నాం. ఇంతలో వాడికి ఏం రోగమొచ్చిందో ఏమో, మెల్లగా వెళ్ళి తలుపు గడియ బిగించి వచ్చాడు.

'పాటలు బాగున్నాయి కదూ' అన్నాడు, 'బాగున్నాయి బావా' అన్నాను.

'వసంతా! ఇంట్లో ఎవరూలేరు. మనం ఇక్కడ ఏం చేసినా అడిగేవాళ్లుండరు. ఇక్కడ ఏం జరిగిందీ మూడోవాళ్ళకు తెలియదు, సరేనా?' అన్నాడు నాలుక చప్పరిస్తూ.

'ఏమిటి బావా, నువ్వు చెప్పేది? నాకేమీ అర్థం కావడం లేదు, ఏం చేద్దామంటావు?' అన్నాను.

తరువాత నారాయణస్వామి నాదగ్గరకు వచ్చి చేయిపట్టుకున్నాడు. నేను విదిలించుకొని లేచి నిలబడ్డాను.

'ఏం చేయాలో అర్థం కాలేదా వసంతా? అదుగో అటుచూడు' అంటూ ఓ కాలెండరు చూపించాడు. అది రాధాకృష్ణుల ఫోటో, విరహదాహంతో కృష్ణుడ్ని పెనవేసుకుని వున్న ఫోటో...

"అయ్యయ్యో. ఏం కాలేదు గదా?" సుళ్ళు తిరుగుతున్న ఏడుపును గొంతులో అదిమిపెట్టి ఆతృతగా అడిగాడు శ్యామ్‌సుందర్.

అది ఆమె మీద సానుభూతి కాదు. తన వసంత శీలం పోగొట్టుకుందేమోనన్న భయం.

"హు... ఏమవుతుందండీ? రాస్కెల్ ఇదట్రా నీ ప్లాను" అంటూ ఈడ్చి చెంపమీద కొట్టాను పళ్లు రాలేటట్లు. పంది ముఖం వాడూనూ! దున్నపోతులా శరీరం పెంచుకుంటే సరిపోయిందా? మేనర్సు ఉండఖ్కర్లా, వేడివేడిగా నాలుగు అంటించి బయటపడ్డాను. ఇక జీవితంలో వాడితో మాట్లాడను." ఆవేశంతో రొప్పుతోంది వసంత.

శ్యామ్‌సుందర్ హడావిడిగా గదిలోకి వెళ్ళాడు. గదిలో ఏదో వస్తువు పగిలిన చప్పుడు వినిపించి లోపలికి తొంగి చూసింది వసంత.

కిందపడి వున్న బొమ్మ తాలూకు ముక్కల్ని చీపురుతో ఒక మూలకు నెడుతున్నాడు శ్యామ్‌సుందర్.

"ఏమండీ మీ టేబులు మీద మూడు కోతి బొమ్మలున్నాయే, అవి ఏమయ్యాయి" అడిగింది వసంత.

"అప్పుడొకటి, అప్పుడొకటి అన్నీ పగిలిపోయాయండి!" లోపల్నుంచి కసిగా పళ్ళు కొరుకుతూ అన్నాడు.

అతను వరండాలోకి వచ్చేసరికి వసంత నిలబడి వుంది.

"ఛీ! మగవాళ్ళను నమ్మకూడదండీ, ఇక ఎవడైనా నా జోలికి వస్తే ఇదే శాస్తి జరుగుతుంది!" ఛీత్కరిస్తూ వెళ్ళిపోయింది.

ఆమె చేసిన హెచ్చరిక ఎవరిని గురించో అర్థం కాలేదు శ్యామ్‌సుందర్‌కి.

ఎందుకయినా మంచిది, నిప్పుకాలుతుంది జాగ్రత్తగా వుండాలి. అనుకొన్నాడు. ఆ రాత్రంతా ఒకటే పీడకలలు. ఆమె చేయి పట్టుకొన్నట్లు, చెంప దెబ్బ తిన్నట్లు.

• • •                    • • •                    • • •

రోజులు గడుస్తున్నాయి. కాని శ్యామ్‌సుందర్ ప్రేమకు ఒకదారి తెన్నూ లేకుండా పోయింది. ఎలాగయినా సరే, తొందరలోనే అటో ఇటో తేల్చుకోవాలనుకొన్నాడు. అందుకే ముందు జాగ్రత్త చర్యగా టౌన్లో వేరే చోట గది మాట్లాడుకొన్నాడు.

అంతా సిద్ధం అయిన తర్వాత ఒక రోజ అన్నింటికి తెగించి రాత్రి ఎనిమిది గంటల సమయంలో వసంత కోసం మేడదిగి కిందకు వచ్చాడు.

“వసంత ఉందాండీ?” అంటూ చనువుగా లోపలికి వచ్చాడు.

వసంత పదేళ్ళ తమ్ముడు ఎదురొచ్చాడు.

“అమ్మ, అమ్మమ్మ ఫస్టు షో సినిమాకి వెళ్ళారు, నాన్న ఇంకా రాలేదు. వసంత అక్క ఒక్కతే గార్డెన్‌లో వుంది, వెళ్లండి సార్” అన్నాడు వాడు.

వీడొక్కడే తన బాధ గమనించేది. పెళ్ళయితే వీడికో మంచి బహుమతి ఇవ్వాలి అనుకొన్నాడు. వసంత ఇంటి వెనుక చిన్న గార్డెనుంది.

శ్యామ్‌సుందర్ ఆ గార్డెన్‌లోకి వెళ్ళాడు. వెన్నెల విరగ కాస్తోంది. అక్కడున్న ఒకకొబ్బరి చెట్టును ఆనుకొని ఒక కాలు దానికి ఆనించి, రెండు చేతులను వెనక్కు వంచి చెట్టును పట్టుకుని నిలబడి ఉంది వసంత. ఆమె నిలుచున్న తీరులో ఆమె వక్షోజాలు గుండ్రంగా, ఎత్తుగా కోట్టచ్చినట్లు కనిపిస్తున్నాయి. సన్నని నడుము, పొడవైన జడ, గాలికి అలల్లా కదిలే పలుచని ఆమె తెల్లచీర, తెల్లజాకెట్టు, తల్లో మల్లెపూలు, వెన్నెల కన్యలా వుంది వసంత.

ఆ పరిస్థితుల్లో ఆమెను చూసిన శ్యామ్‌సుందర్ ‘ఎలాగయినాసరే వసంతను కౌగిలించుకోవాలి, ఒక తీయని ముద్దు పెట్టుకోవాలి, కొడితే ఒక చెంపదెబ్బ, ఇంకా కోపమొస్తే చెప్పుదెబ్బ, ఎవరికి తెలుస్తాయి ఇవన్నీ? రేపెలాగూ రూము ఖాళీ చేస్తున్నాను గదా’ అనుకొన్నాడు.

అంతే! వణకుతున్న శరీరంతో ఉప్పొంగుతున్న ఆవేశంతో, అరమోడ్పు కనులతో పారవశ్యంలో తేలుతున్న వసంతను సమీపించి నడుంచుట్టూ చేతులు వేసి బిగియార కౌగిలించుకుని, చెక్కిలి మీద ముద్దు పెట్టుకున్నాడు. ఎలాగు చెంప పేలిపోతుందని నిర్ణయించుకొన్న శ్యామ్‌సుందర్ మెడ ముందకు చాపాడు ఆమెకు అనుకూలంగా. అతననుకొన్నట్లు చెంప పేలలేదు సరికదా, తపనగా అతుక్కుపోయింది వసంత.

ఇది కలా?కాదు నిజం!

నో! ఇది ముమ్మాటికి కలే! కాదు ముమ్మాటికి యధార్థం!

అతను ఇలా తర్జనభర్జనలు పడుతుండగా “డియర్ శ్యామ్! ఎన్నాళ్లకు నా ప్రేమను గుర్తించావు? ‘నిన్ను ప్రేమిస్తున్నాను వసంతా!’ అనే నీ తీయని మాట కొరకు ఎంతగా నిరీక్షించాను! నా మనసు ఏనాడో నీ కంకితమిచ్చాను శ్యామ్? అందుకే ఇంకొకరికి చోటు లేకుండాపోయింది. ఐ లవ్‌యూ శ్యామ్?” అతని చెవిలో మధురంగా చెప్పింది వసంత.

“నే వింటున్నది నిజమా?” పిచ్చిగా తల తడుముకొంటూ అన్నాడు శ్యామ్ సుందర్.

“నన్ను కౌగిలించుకొన్నది అబద్ధమయితే అదీ అబద్ధమవుతుంది!” చిలిపిగా నవ్వుతూ అంది వసంత ✹

**(మయూరి వీక్లీ, తేది 7-8-1987)**